



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 204 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 30 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :204 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 30 MARCH 2026 | PRICE :

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## వినూత్న రీతిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం...

- మంగళగిరిలో ఘనంగా జరిగిన టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- నూతన పంథాలో వేడుకలు.. వేదికపైకి సామాన్య కార్యకర్తలు
- కార్యకర్తే పార్టీకి అధినేత అనే నినాదానికి పెద్దపీట వేసిన అధిష్టానం
- పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తూ సభ నిర్వహణ





పెన్ పవర్ డెస్క్: తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసారి వినూత్న పంథాలో, కార్యకర్తలకే అగ్రతాంబూలం ఇస్తూ పార్టీ అధిష్టానం ఈ సభను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై

- మిగతా 2లో

# ఆ బాధ్యతను లోకేశ్ కు అప్పగిస్తున్నా

- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం
- మంగళగిరిలో ఘనంగా వేడుకలు
- కార్యకర్తలను దూరంగా పెట్టే నేతలను తాను దూరంగా పెడతానన్న చంద్రబాబు
- పార్టీ కోసం కష్టపడే వారికే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని హామీ
- కష్టపడే వారిని గుర్తించే బాధ్యతను నారా లోకేశ్ కు అప్పగించిన సీఎం



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని, వారిని నిర్లక్ష్యం చేసే నాయకులను తాను ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే నాయకులు మాకు అవసరం లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయిన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈసారి వినూత్నంగా వేదికపై కార్యకర్తలను కూర్చోబెట్టి, సీనియర్ నేతలు సభికుల్లో కూర్చోవడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే నినాదానికి ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చారు.

ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులు అవుతారు

భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. "రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని బలోపేతం చేయండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను, నేతలను గుర్తించే కీలక బాధ్యతను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు అప్పగిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలోనూ పార్టీ బ్రాండ్‌ను నిలిపేలా ఆదర్శంగా ఉండాలని సూచించారు.

**చరిత్ర, వర్తమానం, భవిష్యత్ టీడీపీదే**

తెలుగుదేశం పార్టీ ప్రస్థానాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. "టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి అడుగూ సంచలనమే, ప్రతి నిర్ణయమూ ప్రజాక్షేమమే. నాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా బర్తరఫ్ చేస్తే, ప్రజలే రోడ్లపైకి వచ్చి ఉద్యమించి తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన రూ. 2కే కిలో బియ్యం పథకమే నేటి జాతీయ ఆహార భద్రతా చట్టానికి స్ఫూర్తి. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వంటివి మనమే దేశానికి పరిచయం చేశాం.

- మిగతా 2లో



## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు

- భారత్ తీరం వైపు వస్తున్న రెండు భారీ ఎల్పీజీ నౌకలు
- సుమారు 94,000 టన్నుల ఎల్పీజీతో ప్రయాణం
- గల్ఫ్ ప్రాంతంలో భారత నావికులు, నౌకలు క్షేమంగా ఉన్నారని కేంద్రం ప్రకటన
- ఇప్పటివరకు 942 మంది భారత నావికుల తరలింపు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్

- మిగతా 2లో




## తమిళనాడు ఎన్నికలు: యూత్ కోసం విజయ్ స్పెషల్ అజెండా


- తమిళ యువత కోసం 10 సూత్రాల ఎజెండాను ప్రకటించిన నటుడు విజయ్
- అధికారంలోకి వస్తే అమలు చేస్తామని, ఇది తన గ్యారంటీ అని స్పష్టీకరణ
- డ్రగ్స్ రహిత తమిళనాడు, విద్య కోసం రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణం
- ప్రభుత్వ ఉద్యోగాలకు వార్షిక క్యాలెండర్, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం
- స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు ప్రోత్సాహకాలు

- మిగతా 2లో

## కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆత్మీయ విందు, ఘనసత్కారం...

- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం
- సీనియర్ కార్యకర్తలకు నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్
- కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న అధినేత
- పార్టీ కోసం చేసిన త్యాగాలు మరువలేనివన్న ముఖ్యమంత్రి
- కొత్త బట్టలు, శాలువాలతో కార్యకర్తలకు సత్కారం

- మిగతా 2లో



## గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.. కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

- పశ్చిమాసియా సంక్షోభంలో భారతీయులను ఆదుకున్న గల్ఫ్ దేశాలు
- విమాన సర్వీసులు నిలిచినప్పుడు తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు
- బలమైన దౌత్య సంబంధాల వల్లే ఇది సాధ్యమైందన్న ప్రధాని మోదీ

- మిగతా 2లో




## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి... గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- అక్రమ మైనింగ్ ఆరోపణలపై మంత్రి పొంగులేటిని తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- గన్ పార్క్ వద్ద ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్, హరీశ్ రావు నిరసన
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై సభా సంఘంతో విచారణకు పట్టు
- మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- ప్రభుత్వం స్పందించకుంటే గవర్నర్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిక




పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణల నేపథ్యంలో, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నాడు అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అనంతరం ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఈ నిరసనలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి కుటుంబానికి

- మిగతా 2లో



## ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల అమరావతి రైతులకు న్యాయం జరగదు

- అమరావతి రైతులకు న్యాయం చేయాలంటూ విజయసాయిరెడ్డి ట్వీట్
- అమరావతి రైతులకు ప్లాట్లతో పాటు అదనపు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- 11 ఏళ్లలో ఒక్కరైనా ఇల్లు కట్టుకోగలిగారా అని ప్రశ్న
- పేదలకు గతంలో ఇచ్చిన 50 వేల ఇళ్ల పట్టాలు పునరుద్ధరించాలని స్పష్టీకరణ
- భూములిచ్చిన వారికే న్యాయం జరగకుంటే రాజధాని ఎవరికని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసా యిరెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు


- మిగతా 2లో

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణంపై రఘురామ కీలక ప్రకటన

- ఆకివీడులోని పురాతన రామాలయం పునర్నిర్మాణం
- కృష్ణశిలతో నిర్మిస్తామని ప్రకటించిన రఘురామకృష్ణరాజు
- 8 శతాబ్దాలు చెక్కుచెదరకుండా నిర్మాణం ఉంటుందని వెల్లడి
- ప్రముఖ స్థపతి ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలో పనులు
- ఇటీవల ఇదే ఆలయం వద్ద రఘురామపై దాడి యత్నం

పెన్ పవర్ డెస్క్:ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలోని పురాతన రామాలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఇటీవల శ్రీరామనవమి రోజున తనపై దాడికి

- మిగతా 2లో



## పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే



- పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే: జైరాం రమేశ్
- పాక్‌కు అమెరికా ఆమోదం.. మోదీ సర్కార్ విదేశాంగ వైఫల్యమేనన్న కాంగ్రెస్
- పాకిస్థాన్ 'మధ్యవర్తి'గా మారిందంటూ కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శ
- కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టిన బీజేపీ
- జైశంకర్ వ్యాఖ్యలకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మద్దతు
- 'దళారీ' పదం చుట్టూ తిరుగుతున్న రాజకీయ వివాదం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# కిమ్ టార్గెట్ అమెరికా

ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ అమెరికాను లక్ష్యంగా చేసుకునే క్షిపణుల సామర్థ్యాన్ని స్వయంగా పరీక్షించారు. అధిక సామర్థ్యంతో పనిచేసే ఘన ఇంధన ఇంజిన్ భూమిపై చేసిన పరీక్షను స్వయంగా వీక్షించారు. ఇది దేశ వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని పెంచే కీలక అభివృద్ధి అని ఆయన ప్రశంసించినట్లు అధికార వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ ఆదివారం వెల్లడించింది. ఈ పరీక్ష అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరగల క్షిపణుల సామర్థ్యాన్ని పెంచి, ఆయుధ సంపత్తిని విస్తరించాలనే కిమ్ సంకల్పాన్ని సూచిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఉత్తర కొరియా పార్లమెంట్‌లో కిమ్ చేసిన ప్రసంగంలో దేశాన్ని శాశ్వత అణు శక్తిగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. మధ్యప్రాచ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ అమెరికాపై 'రాష్ట్ర ఉగ్రవాదం, దాడి ధోరణి' ఆరోపణలు చేశారు. కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ నివేదిక ప్రకారం కార్బన్ ఫైబర్ పదార్థంతో అప్‌గ్రేడ్ చేసిన ఈ కొత్త ఇంజిన్ గరిష్ఠంగా ఒత్తిడి 2,500 కిలోటన్నులుగా నమోదైంది. సెప్టెంబరులో జరిగిన ఇలాంటి ఘన ఇంధన ఇంజిన్ పరీక్షలో ఇది సుమారు 1,971 కిలోటన్నులుగా ఉండేది.

ఇంజిన్ శక్తిని పెంచడం వెనుక ఒకే క్షిపణిలో అనేక అణు వార్‌హెడ్‌లను అమర్చి, అమెరికా రక్షణ వ్యవస్థలను దాటిచెప్పే అవకాశాన్ని పెంచాలనే యత్నం ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. పరీక్ష ఎప్పుడు, ఎక్కడ జరిగింది అనే వివరాలు కెసీఎన్‌ఏ వెల్లడించలేదు. ఐదేళ్ల సైనిక విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపింది. ఈ ప్రణాళికలో "వ్యూహాత్మక దాడి సామర్థ్యాల" మెరుగుదల ప్రధాన లక్ష్యమని పేర్కొంది. దీనర్థం అమెరికా ఖండాన్ని లక్ష్యంగా చేసుకున్న అణు సామర్థ్యంతో కూడిన అంతర్మహాద్వీప క్షిపణుల అభివృద్ధి అని అర్థమవుతోంది. కిమ్ తాజా ఇంజిన్ పరీక్ష దేశ వ్యూహాత్మక సైనిక బలాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తుందని వ్యాఖ్యానించినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఇటీవలి సంవత్సరాల్లో ఉత్తర కొరియా పలు రకాల అంతర్మహాద్వీప క్షిపణులను ప్రయోగించింది. ఘన ఇంధన క్షిపణులు ముందస్తు గుర్తింపును కష్టతరం చేస్తాయి. పాత ద్రవ ఇంధన క్షిపణులను ప్రయోగానికి ముందు ఇంధనం నింపాల్సి రావడం వల్ల అవి ఎక్కువసేపు సిద్ధంగా ఉండలేవు.

**ట్రంప్ తో చర్చల తర్వాత వేగం...**

కొంతమంది విదేశీ నిపుణుల అభిప్రాయం ప్రకారం వాతావరణంలో తిరిగి ప్రవేశించే సమయంలో వార్‌హెడ్‌లు ఎదుర్కొనే తీవ్ర పరిస్థితులను తట్టుకునే సాంకేతిక సామర్థ్యం ఇంకా ఉత్తర కొరియాకు పూర్తిగా సిద్ధం కాలేదని అంటున్నారు. అయితే మరికొందరు దీన్ని ఖండిస్తూ, ఎన్నేళ్లుగా అణు, క్షిపణి కార్యక్రమాలు కొనసాగుతున్నందున ఈ సవాళ్లను అధిగమించి ఉండవచ్చని భావిస్తున్నారు. 2019లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో కిమ్ జరిపిన చర్చలు విఫలమైన తర్వాత ఉత్తర కొరియా అణు ఆయుధ విస్తరణపై మరింత దృష్టి పెట్టింది. ఫిబ్రవరిలో జరిగిన వర్కర్స్ పార్టీ సమావేశంలో ట్రంప్‌తో సంభాషణలకు తలుపులు తెరిచే అవకాశం ఉందని కిమ్ చెప్పినా, ముందుగా అణు నిరాయుధీకరణను షరతుగా పెట్టవద్దని వాషింగ్టన్‌కు సూచించారు.

## ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల అమరావతి రైతులకు న్యాయం జరగదు

- మొదటి పేజి తరువాయి

గతంలో ఇస్తామన్న నివాస, వాణిజ్య ప్లాట్లతో పాటు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం అదనంగా నష్టపరిహారం కూడా చెల్లించాలని కోరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు."ఒక రైతుగా అడుగుతున్నా. నా అమరావతి రైతు సోదరుల కోసం అధికారపార్టీని అడుగుతున్నా. 2015లో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతుల్లో ఎవరైనా వారికి కేటాయించిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోగలిగారా? వారిలో ఏ ఒక్క రైతు అయినా వారికి ఇచ్చిన కమర్షియల్ స్థలంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్ కట్టగలిగారా? ఈ 11 ఏళ్ళ కాలంలో వారికి కేవలం ఏడాదికి ఇంత అని నామమాత్రంగా డబ్బు ఇవ్వటం వల్ల కలిగిన లాభం ఏమిటి? రైతుల త్యాగాలు వెల కట్టలేనివి అని నిన్న శాసన సభలో పలువురు సభ్యులు చెప్పారు. ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల రైతులకు న్యాయం జరగదు. భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికి అయినా ఇంతకు ముందు మీరు ఇస్తాం అన్న ఇళ్ల స్థలం, కమర్షియల్ స్థలం మాత్రమే కాకుండా, అదనంగా ఫెయిర్ కాంపిన్సేషన్ చట్టం 2013 ప్రకారం నష్ట పరిహారం ఇవ్వండి. అసైన్డ్ భూముల విషయంలో ఒరిజినల్ హక్కుదారులకే నష్ట పరిహారం ఇవ్వండి. అలాగే మరో విషయాన్ని కూడా అడుగుతున్నా, నిరుపేదలకు గత ప్రభుత్వం కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను మీరెందుకు రద్దు చేశారు? ఆ ప్లాట్లను ఆ నిరుపేదలకే తిరిగి ఇవ్వండి. ఒక వైపు లక్షల కోట్లతో రాజధాని కడతాం అంటున్నారు. మీరు కట్టండి కానీ, ఆ భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయనట్టయితే, ఆ నిర్మించే భారీ భవనాల పునాదులు ఎవరి భూముల్లో నిర్మిస్తున్నారో వారికే సంతృప్తి, సంతోషం కలిగించనట్టయితే ఏమిటి ప్రయోజనం? అలా నిర్మించే రాజధాని వల్ల ఏ ధనికులకి, బూర్జువాలకి లాభం కలుగుతుందో ప్రజలు కూడా ఆలోచన చేస్తారని మీరు కూడా గమనించండి" అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# ఆ బాధ్యతను లోకేశ్ కు అప్పగిస్తున్నా

- మొదటి పేజి తరువాయి

డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశాం. బీసీలకు రాజ్యాధికారం, ఎస్సీలకు వర్గీకరణ, ఎస్టీలు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశాం" అని వివరించారు.

**టీడీపీని ఫినిష్ చేస్తామన్నారు... వాళ్లే ఫినిష్ అయ్యారు**

పార్టీ ప్రస్థానంలో ఎన్నో సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొన్నామని చంద్రబాబు అన్నారు. "టీడీపీని ఫినిష్ చేస్తామన్న వారే ఫినిష్ అయ్యారు. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు కోల్పోయారు. నాపై అలిపిరిలో హత్యాయత్నం జరిగింది. 2019-24 మధ్య కాలంలో నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా కార్యకర్తల అండతోనే ముందుకు సాగాం. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాల ఫలితమే" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చంద్రయ్య అనే కార్యకర్త త్యాగాన్ని గుర్తుపెట్టుకుని, ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**'సూపర్ సిక్స్'తో సంక్షేమ పాలన**

2024 ఎన్నికల్లో బీజేపీ-జనసేనతో కలిసి చారిత్రక విజయం సాధించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. దేశంలోనే ఎవరూ ఇవ్వని విధంగా రూ.4,000 సామాజిక పెన్షన్ ఇస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాలను అమలు చేస్తున్నాం. డీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టాం. తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. చెప్పినట్టుగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా పరిశ్రమలను ఆకర్షిస్తున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, నిలబెట్టుకున్నాం. ఈ ఏడాది కూడా పెంచం, భవిష్యత్తులోనూ పెంచబోం" అని స్పష్టం చేశారు.

**ఒకే రాజధాని.. అభివృద్ధి ప్రణాళిక**

రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికపై చంద్రబాబు స్పష్టతనిచ్చారు. "పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతిలో గతంలో ప్రారంభించిన పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఇక మూడు ముక్కలాట లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదే అమరావతి" అని పునరుద్ఘాటించారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ, వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**వేదికపై కార్యకర్తలు.. సరికొత్త పంథా**

ఈసారి ఆవిర్భావ దినోత్సవ సభలో ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ, పార్టీ కోసం కష్టపడిన 19 మంది సామాన్య కార్యకర్తలను వేదికపై ఆసీనులను చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ నాయకులు సభికుల మధ్య కూర్చున్నారు. సభా నిర్వహణ బాధ్యతలను యువ నాయకురాలు కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ దీవుల నుంచి టీడీపీ నేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు, చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. పార్టీ బలోపేతానికి పునరంకితమవుతామని కార్యకర్తలతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు.

## కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆత్మీయ విందు, ఘనసత్కారం...

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ తమ నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు ఆత్మీయ విందు ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి నిరంతరం సేవలందిస్తున్న సీనియర్లను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ విందుకు హాజరైన ప్రతి కార్యకర్త వద్దకు వెళ్లి వారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారి సేవలను ఆయన కొనియాడారు. తమను కుటుంబ సభ్యులుగా భావించి, స్వయంగా ఇంటికి ఆహ్వానించి విందు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. అధినేత చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, విందుకు హాజరైన కార్యకర్తలందరినీ చంద్రబాబు, లోకేశ్ కొత్త బట్టలు పెట్టి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.. కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు, వేలాది మంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ వివరించారు. "కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే

ఒకప్పుడు ఏకాకిగా ఉన్న పాకిస్థాన్‌కు, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అమెరికా నుంచి కొత్తగా గౌరవం, మధ్యవర్తి హోదా లభించడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించింది.

కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ... గతంలో క్లింటన్, బుష్, ఒబామా, బైడెన్ వంటి అమెరికా అధ్యక్షులు పాకిస్థాన్‌తో కఠినంగా వ్యవహరించారని గుర్తుచేశారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత అంతర్జాతీయంగా ఏకాకిగా మారిన పాక్‌కు ఇప్పుడు ట్రంప్ హయాంలో కొత్త ఆదరణ లభించిందన్నారు. "భారత్ సైనికపరంగా 'ఆపరేషన్ సిందూర్'లో విజయం సాధించినా, దాన్ని దౌత్యపరంగా సద్వినియోగం చేసుకోవడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. విదేశాంగ మంత్రి జైశంకర్ మాటల్లో చెప్పాలంటే పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'గా మారింది. ఇది మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం" అని జైరాం రమేశ్ విమర్శించారు.

కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ గట్టిగా తిప్పికొట్టింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ దేశ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారని, కానీ కాంగ్రెస్ నిరంతరం దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను 'దళారీ' అని పిలిచినందుకు విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఆయన అభినందించారు.

ఇటీవల మార్చి 25న జరిగిన అఖిలపక్ష సమావేశంలో విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ "భారత్ ఎప్పటికీ 'దళారీ' దేశంగా ఉండబోదు" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఇదే 'దళారీ' పదం చుట్టూ కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## తమిళనాడు ఎన్నికలు: యూత్ కోసం విజయ్ స్పెషల్ అజెండా

తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమైన నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, యువతనే లక్ష్యంగా చేసుకుని కీలకమైన అడుగులు వేస్తున్నారు. ఆదివారం నుంగంబాక్కంలో జరిగిన ఓ కార్యక్రమంలో, రాష్ట్ర యువత భవిష్యత్తును మార్చేందుకు ఉద్దేశించిన 10 పాయింట్ల సమగ్ర యూత్ అజెండాను ఆయన ఆవిష్కరించారు. తాము అధికారంలోకి వస్తే ఈ హామీలను కచ్చితంగా అమలు చేస్తామని, ఇవి కేవలం వాగ్దానాలు కావని, ఒక 'గ్యారెంటీ' అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక హామీ కాదు, ఇది టీవీకే గ్యారెంటీ... మీ సోదరుడు విజయ్ గ్యారెంటీ" అని యువతతో నేరుగా సామాజిక ఒప్పందం చేసుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై స్పందిస్తూ, విద్య, ఉపాధి, పాలన సంస్కరణలే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**విజయ్ ప్రకటించిన ముఖ్య హామీలు ఇవే:**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల కోసం 'తమిళనాడు రిక్రూట్‌మెంట్ అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్' తీసుకొస్తామని విజయ్ తెలిపారు. దీని ద్వారా ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీకి ఒక స్థిరమైన క్యాలెండర్ విడుదల చేసి, ఏడాదిలోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు, 25 ఏళ్లు పైబడిన పట్టభద్రులకు నెలకు రూ. 4,000, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసినవారికి రూ. 2,500 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు.

ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో 'ఎడ్యుకేషన్ గ్యారెంటీ స్కీమ్' కింద రూ. 20 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందిస్తామన్నారు. అలాగే, ఏటా ఐదు లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి, గ్రాడ్యుయేట్లకు రూ. 10,000, డిప్లొమా హోల్డర్లకు రూ. 8,000 స్టైఫండ్ ఇస్తామని చెప్పారు.

యువతలో వ్యవస్థాపకతను ప్రోత్సహించేందుకు రూ. 25 లక్షల వరకు రహిత రుణాలు అందిస్తామన్నారు. అలాగే, కనీసం 75% స్థానికులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీలను ప్రోత్సహించడానికి "తమిళ్ ఎంప్లాయ్‌మెంట్ క్రెడిట్ సిస్టమ్" ప్రవేశపెడతామని తెలిపారు. "మత్తుపదార్థాల రహిత తమిళనాడు"ను నిర్మించడం తమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని విజయ్ స్పష్టం చేశారు. ఇందుకోసం కఠినమైన చట్టాలు తీసుకురావడంతో పాటు, పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ-డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా స్థానిక సంస్థల్లో 'చీఫ్ మినిస్టర్స్ పీపుల్ సర్వీస్ అసోసియేట్స్'గా యువతను నియమించి, వారికి నెలకు రూ. 18,000 గౌరవ వేతనం ఇస్తామన్నారు.

విధాన రూపకల్పనలో యువత భాగస్వామ్యం కోసం 'యూత్ అడ్వైజరీ కౌన్సిల్' ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వీటితో పాటు, 1.5 లక్షల మంది యువతకు 'క్రియేటర్-ప్రెన్యూర్' కార్యక్రమం కింద మూలధనం, రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు వంటివి తన అజెండాలో ఉన్నాయని విజయ్ వివరించారు. ఈ ప్రకటనలన్నీ తమిళనాడు యువత భవిష్యత్తును సురక్షితం చేయడానికేనని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ యువత కేంద్రంగానే రాజకీయాలు చేస్తుందని విజయ్ స్పష్టం చేశారు.

## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు

గల్ఫ్ ప్రాంతం నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్లు సురక్షితంగా భారత్ తీరం వైపు ప్రయాణిస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూ మంగళూరుకు చేరుకోనున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్), నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24ఐ7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొంది. గత 24 గంటల్లో నలుగురు నావికులను తరలించిన్నట్టు తెలిపింది. భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది. గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, 24ఐ7 హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయని విదేశాంగ శాఖ వివరించింది.

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణంపై రఘురామ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

యత్నం జరిగిన ప్రదేశంలోనే ఈ ఆలయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నట్లు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ మేరకు ఆయన ఆదివారం నాడు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ప్రముఖ హిందూ సంస్థల ఆధ్వర్యంలో, సుప్రసిద్ధ స్థపతి (శిల్పకళా నిపుణుడు) డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గారి నేతృత్వంలో ఈ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. శిల్పకళ, వాస్తు, ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా పూర్తిగా కృష్ణ శిలతో ఆలయాన్ని నిర్మిస్తామని, కనీసం 8 శతాబ్దాల పాటు చెక్కుచెదరని విధంగా ఈ నిర్మాణం ఉంటుందని రఘురామ వివరించారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఇదే ఆలయం వద్ద రఘురామకృష్ణరాజుపై కొందరు దాడికి యత్నించిన ఘటన కలకలం రేపడం తెలిసిందే.

## వినూత్న రీతిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం...

- మొదటి పేజి తరువాయి

భారీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఆవిర్భావ సభను "కార్యకర్తే అధినేత" అనే నినాదాన్ని ప్రతిబింబించేలా నిర్వహించడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన 19 మంది సామాన్య కార్యకర్తలను వేదికపై కూర్చోబెట్టి గౌరవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వంటి సీనియర్ నేతలు సభికుల మధ్యలో ఆశీనులయ్యారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులు ఎదుర్కొన్న వారికి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారికి ఈ వేదికపై ప్రాధాన్యం ఇచ్చారు. సభా నిర్వహణ బాధ్యతలను యువ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్యకర్తలు పార్టీతో తమకున్న అనుబంధాన్ని, తాము చేసిన సేవను భావోద్వేగంతో పంచుకున్నారు. తమ లాంటి సామాన్య కార్యకర్తలను గౌరవించే ఏకైక పార్టీ టీడీపీనేనని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.


## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి... గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- మొదటి పేజి తరువాయి

చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ, దీనిపై సభా సంఘం లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆధారాలతోనే హరీశ్ రావు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారని అన్నారు. ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, మంత్రి కుటుంబ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కంపెనీతో మంత్రి భార్య, కుమారుడు, సోదరుడికి ప్రత్యక్ష సంబంధాలున్నాయని, 2020-22 మధ్య పొంగులేటి చైర్మన్‌గా ఉన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి పొంగులేటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సీఎంకు కూడా ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని హెచ్చరించారు.

# వైభవంగా శ్రీ మేనకేశ్వర స్వామి కళ్యాణం


**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**కె. పెదపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి శ్రీ రుక్మిణీ , సత్యభామ సమేత కృష్ణారాయుడు స్వామి వారి దివ్య కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ స్వామివారి కళ్యాణం తిలకించి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసారు.




పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కళ్యాణ మహోత్సవం

## స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:**ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మంగళవాయిద్యాలు, వేదఘోషలతో మారుమోగి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి సాయంత్రం వరకు వేచి ఉండి స్వామివారి కళ్యాణోత్సవాన్ని దర్శించుకొని పుణ్యఫలాన్ని పొందారు.కళ్యాణానికి ముందు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు నిర్వహించి, శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు, పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్, రాష్ట్ర బీసీ చైర్మన్ రెడ్డి అనంతలక్ష్మి, కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ దంపతులు, మండల ఎంపీపీ కుండా అనంతలక్ష్మి, జడ్పీటీసీ బోనం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వేద పండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి వర ప్రసాద చార్యులు అర్చక బృందంతో కలిసి పుణ్యాహవాచనంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ సూక్తం, పురుష సూక్తం పఠనాలతో స్వామివారిని స్తుతించారు. స్వామివారి పాదాలకు నిర్వహించిన పాద ప్రక్షాళన ఘట్టం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లినట్లు అనిపించింది.

మంగళాష్టకాల మధ్య కళ్యాణ ఘట్టం ఉత్సాహభరితంగా సాగగా, లగ్నాష్టకం సమయంలో అర్చకులు శాస్త్రోక్తంగా తాళి కట్టే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వేదఘోషలు, నాదస్వరాలు నడుమ స్వామివారి దివ్య కళ్యాణం ఘనంగా ముగిసింది.

తదనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వెంకటరాజు, ధర్మకర్త మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ దివ్య కళ్యాణ మహోత్సవం వాడపల్లి గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచి, భక్తుల్లో అపారమైన ఆనందోత్సాహాన్ని నింపింది. అంతరిక్షమే ఆయన క్షేత్రం అతి చాకచక్యంగా తన అనుభవాన్ని రంగరించి ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు, ఎలా ఉంది అంటే ఎంతో అద్భుతంగా నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఎంతో చక్కగా తీర్చిదిద్దారు . ఈ కార్యక్రమం వీక్షించిన ప్రతి ఒక్కరితో ప్రశంసలు అందుకున్నారు





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జగ్గంపేటలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 29:** తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ప్రస్థానం కొనసాగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో 44వ టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొని అనంతరం జగ్గంపేట చేరుకున్నారు. జగ్గంపేట కూడలిలో ఉన్న టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం నాయకులతో కలిసి టిడిపి జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. 44 సంవత్సరాలగా టిడిపిలో కొనసాగుతున్న ఎనిమిది మంది కార్యకర్తలను, నియోజవర్గంలో బెస్ట్ పర్ఫామెన్స్ ఇస్తున్న నాయకులను, నియోజవర్గంలోని 300 మంది టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. మంగళగిరి టిడిపి కార్యాలయం నుండి ప్రత్యక్ష ప్రసారంలో టిడిపి జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం టిడిపి ప్రస్థానంపై ఏర్పాటు చేసిన ఆడియో, వీడియో ప్రదర్శన వీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో జ్యోతుల నెహ్రూమాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవం దశదిశలా వ్యాప్తి చేయడమే లక్ష్యంగా 1982లో ఇదే రోజున అన్న ఎన్టీఆర్ కూడు గుడ్డ నీడ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గంలోని 4 మండలాల నుంచి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా చిన్నారులు అందించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అను సకల కళల ఉచిత శిక్షణా కేంద్రానికి చెందిన విద్యార్థులు శ్యామ్ మాస్టరు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో "కృష్ణలీలలు" పేరుతో ఇంద్రజాల ప్రదర్శనతో పాటు క్లాసికల్, ఫోక్ పాటలు, నృత్యాలతో చిన్నారులు తమ ప్రతిభను చాటారు.

కార్యక్రమం అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరావు చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే చిన్నారులకు శిక్షణ అందిస్తున్న శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అధికారులు వై శ్రీనివాస్, దత్తు, సునీత తదితరులు పాల్గొన్నారు.


# ర్యాలి గౌడ రామాలయంలో కోదండరాముని కళ్యాణం అన్నదానంలో భక్తుల సందడి





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని గౌడ రామాలయంలో కోదండరాముని కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవం అనంతరం ఆదివారం ఉదయం నుండి నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన భక్తులందరికీ విస్తృతంగా వంటకాలు సిద్ధం చేసి సత్కారం చేశారు. స్వీట్లు, చెరన్నం, బూరి, పులిహోర, వెజిటేబుల్ బిర్యాని, ములక్కాడ టమాట పప్పు, గుమ్మడికాయ పులుసు, కొత్తిమీర పచ్చడి, సాంబారు, పెరుగు వంటి పదార్థాలతో భోజనాన్ని సమృద్ధిగా వడ్డించారు. ప్లేట్లు నిండా పెట్టి, కడుపునిండా తినేలా ఏర్పాటు చేయడం భక్తులను ఆకట్టుకుంది. అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు నిర్వాహకులను అభినందిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సుమారు 3,500 మందికి పైగా భక్తులు హాజరై అన్నదానం పొందినట్లు గౌడ సంఘ పెద్దలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంఘ సభ్యులు, గ్రామస్థులు విశేషంగా కృషి చేశారు.

# డాక్టర్ కొప్పుల నాగ మానసకు ఘన సన్మానం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ కొప్పుల నాగ మానసను అమలాపురంలో ఘనంగా సన్మానం చేశారు.
గండువీది శ్రీ శేషశయన మైనర్స్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, ఆమెకు నియామక ఉత్తర్వులు అందిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో ఆమె విశేష సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పడాల శ్రీదేవి, పడాల నానాజీ, ఇతర ముఖ్య నేతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# వాడపల్లి రథోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు








**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవం భక్తుల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు.
ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. తదుపరి పాలకమండలి ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, సభ్యులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావుతో కలిసి ఎమ్మెల్యే రథోత్సవంలో పాల్గొన్నారు.
వాడపల్లి వీధుల్లో గోవింద నామస్మరణల మధ్య స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా సాగి భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తింది.

# బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం: తాళ్లూరు ఆత్మీయ సమావేశంలో వక్తల పిలుపు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 29:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో నిర్వహించిన బీసీ కులాల ఆత్మీయ సమావేశం బీసీల చైతన్యానికి వేదికగా నిలిచింది. 13 బీసీ కులాల ప్రతినిధులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో పంపన రామకృష్ణ,పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి,ఒమ్మి రఘు రామ్, వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం అబ్జార్వర్
.కుండల సాయి, బీజేపీ, దీజ జాతీయ ఉపాధ్యక్షులు
.పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపకులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు
.వియ్యపు అప్పలస్వామి, బిసి సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు
.బాలాజీ శంకర సింగ్, బొందులీల రాష్ట్ర అధ్యక్షులు,
పంచికట్ల రామకృష్ణ యాదవ్, దీజ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు , తదితర
వక్తలు పాల్గొనగా ముందుగా జ్యోతిరావు పూలే గ్రహానికి పూలుమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల సామాజిక, రాజకీయ భవిష్యత్తుపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచంలో ఉన్న కుల, మత వివక్షలను పోగొట్టగలిగే ఏకైక ఆయుధం విద్య మాత్రమేనని, పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఒక ఐఏఎస్, ఐపిఎస్ అధికారి అయితే ఎవరైనా సరే సెల్యూట్ కొట్టాల్సిందేనని, ఆ స్థాయికి మన బిడ్డలు ఎదగాలని ఆకాంక్షించారు.
ఓటు హక్కు వినియోగం: రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని సరైన సమయంలో, సరైన విధంగా ఉపయోగించుకోకపోవడమే బీసీల వెనుకబాటుతనానికి ప్రధాన కారణమని విశ్లేషించారు. మన హక్కుల కోసం ప్రశ్నించే చైతన్యం మనలో రావాలని కోరారు.
ఐక్యత లేకపోవడం బీసీలు సంఖ్యాపరంగా బలంగా ఉన్నప్పటికీ.. పార్టీలు, ప్రాంతాలు, కులాల వారీగా విడిపోవడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇంట్లో ఉన్నప్పుడే కులం.. బయటకు వస్తే మనమందరం బీసీలం" అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు.
నాయకత్వాన్ని, రిజర్వేషన్ల ద్వారా కేవలం ప్రతినిధులు మాత్రమే కాకుండా, నిజమైన నాయకులు తయారవ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. మనలో ఎవరైనా నాయకుడిగా ఎదుగుతుంటే, ఆర్థికంగా వెనుకబడిన వారికి తోటి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ, మహిళా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 1979లో మండల కమిషన్ సిఫార్సుల వల్లే నేడు బీసీలకు ఈమాత్రం రాజకీయ ప్రాధాన్యత దక్కుతోందని గుర్తు చేశారు. ఈ సమావేశం సందర్భంగా ప్రతి గ్రామంలో 13 కులాలతో కూడిన ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు బీసీలను చైతన్యపరచాలని నిర్ణయించారు. రాబోయే రెండు మూడు నెలల్లో భారీ ఎత్తున జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.
బీసీల సంక్షేమం కోసం, హక్కుల పోరాటం కోసం ఈ ఐక్య వేదిక నిరంతరం కొనసాగాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ముఖ్య అతిథులను దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో బీసీ సంఘ నాయకులతో పాటు తాళ్లూరు గ్రామంలో బీసీల మహిళలు , పురుషులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# క్రికెట్ బెట్టింగ్ పై అత్యాశకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు



జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:** ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన యువతను, తల్లిదండ్రులను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు.
జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులపై, ఆన్‌లైన్ బుకీలపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా పాల్గొన్నా ఏపీ జూద చట్టం (ఱ్రా +ఘఎఱఅస్త్ర-ాఘ్) ఏపి గ్యామింగ్ యాక్టు ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు.
తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడకండి. శ్రమించకుండా వచ్చే సొమ్ము శాశ్వతం కాదు, అది మీ భవిష్యత్తును అంధకారం చేస్తుందని తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలి. స్మార్ట్ ఫోన్‌లలో వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేది గమనిస్తూ ఉండాలన్నారు. క్రికెట్ ఒక వినోదం మాత్రమే. దానిని జూదంగా మార్చి మీ కుటుంబాలను వీధిన పడేయకండి. ఒక్క తప్పుడు అడుగు మీ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల కలలను చిన్నాభిన్నం చేస్తుందని రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ సూచించారు.
బాల్-టు-బాల్ బెట్టింగ్, ఆకర్షణీయమైన ఆఫర్ల వెనుక పెద్ద మోసం దాగి ఉంటుంది. బెట్టింగ్ వల్ల అప్పుల పాలు కావడమే కాకుండా, సామాజికంగా గౌరవం కోల్పోవాల్సి వస్తుందన్నారు.
మీ పరిసరాల్లో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:** అమలాపురం రూరల్ కామనగరువు గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు ఘనంగా నివాళులు అర్పించారు. స్వీట్లు పంచి బాణాసంచా కాల్చారు.
ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి రాజులపూడి భీముడు మాట్లాడుతూ ఎన్టీఆర్ చేసిన అభివృద్ధినీ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వాకా శ్రీను, ఉపాధ్యక్షులు రాజులపూడి మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బడుగు రాజ్ కుమార్ ,సీనియర్ నాయకులు రాజులపూడి సత్యనారాయణ, కామన గంగాధరరావు, కంటంశెట్టి శ్రీను, వాక భాస్కరరావు, హనుమంత రావు, ఆదినారాయణ, విష్ణు,ప్రభు, దొమ్మేటి అదిబాబు,బొక్క చిన్న, నక్కా శ్రీను, కొప్పిశెట్టి సత్య నారాయణ, సవరపు ప్రసాద్,శ్రీధర్,
న్వామి,కోమటి,చిన్నబ్బాయి,సూర్రవు,దుర్గా రావు,మురళి, రాము తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 30న పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు


**కాకినాడ, పెన్ పవర్, మార్చి 29:**ప్రజా సమస్యల పరిష్కారానికి 1100 కాల్ సెంటర్ సేవలు వినియోగించాలి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ జిల్లాలో మార్చి 30వ తేదీన పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని తెలిపారు.

రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ కూడా నిర్వహించబడుతుందని, జిల్లాస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.ఇప్పటికే అర్జీలు సమర్పించి పరిష్కారం పొందని వారు లేదా తమ ఫిర్యాదుల స్థితి గురించి తెలుసుకోవాలనుకునే వారు 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

అదేవిధంగా, ప్రజలు తమ ఫిర్యాదులను వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు డివిజన్,మండల, మున్సిపల్ స్థాయిలలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని, ప్రజలు తమ సమీప కార్యాలయాలలో కూడా అర్జీలు సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.






# మండలంలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం





**కాజులూరు, పెన్‌పవర్, మార్చి 29:**మండల పరిధిలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.గొల్లపాలెంకాజులూరు సెంటర్‌లో సీనియర్ నాయకుడు చుండ్రు వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి,పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం బాటసారులు, వాహనదారులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించగా,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.అలాగే తణుకువాడ,శలపాక,మంజేరు, ఆర్యవటం,పెనుమళ్ళ తదితర గ్రామాల్లో టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.ధనరాజు,చందాల ఆదినారాయణ, కోట తాతబ్బాయి,కొల్లి హనుమంతు చౌదరి, బొడ్డు నాగమల్లేశ్వరరావు,అంగర కృష్ణ, కోకా హరి, కొప్పిశెట్టి లక్ష్మి నారాయణ,నక్కా శ్రీను, అత్తిలి వెంకటరమణ,ఎస్.సుబ్బారావు,వల్లు అర్జునరావు, పితాని సతీష్,సలాది సాయిబాబు,యర్రంనీడి గోవింద్,దడాల నాగార్జున, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుక జెండా ఆవిష్కరణ



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సెంటర్లో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి లు గూడాల ఫణి, రవణం రాము ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి. స్వీట్లు పంచారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వివి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదలకు అండగా ఉండాలనే సంకల్పంతో తెలుగుదేశం పార్టీ ని స్థాపించి అన్నివర్గాల వారి అభివృద్ధికి కృషిచేసిన మహానాయకుడని ప్రజలగుండెల్లో నిలిచారని అన్నారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరిగెల బలరామమూర్తి, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, నాగాబత్తుల సుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, కత్తుల బాబులు, పల్ల శ్రీ నివాసరావు, మిద్దుల శ్రీ ను, కేతా అర్జునరావు, పితాని ఈశ్వరరావు, తిరుమనాథం హనుమంతరావు, నేదునూరి కళ్యాణ్, ,ఈతకోట నాగరాజు , కుడుపూడి శ్రీ నివాసరావు, జోగి కృష్ణ చైతన్య, గుత్తుల సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 29:**మండల కేంద్రమైన గండేపల్లి లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండల అధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పోతుల మోహన్రావు ఆధ్వర్యంలో నిర్వహించగా మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి, అక్కడే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలు మాలలు వేసి ఘన నివాళులర్పించారు. పోతుల మోహన్ రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం దివంగత ముఖ్యమంత్రి అన్న ఎన్టీఆర్ స్థాపించారన్నారు. శుభసూచకానికి ప్రత్యేకత జెండా ఆవిష్కరించిన మహోన్నత వ్యక్తి దివంగత నేత అన్న నందమూరి తారక రామారావు అని గుర్తు చేశారు. ఆనాడు పేద ప్రజల కోసం ఎన్టీఆర్ రెండు రూపాయలకే తెలుగు బియ్యం అందించడం అభినందనీయమన్నారు. పేద, నిరుపేద, బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్న నందమూరి తారక రామారావు అని కొనియాడారు. నందమూరి తారక రామారావు ఆసియాలకు అనుగుణంగా నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , తనయుడు నారా లోకేష్ అహర్నిశలు కష్టపడి రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు రూముందిస్తూ అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. అంతేకాకుండా జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి చేయంగా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తనయుడు జ్యోతుల నవీన్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాస్తి వసంత్, వైస్ ఎంపీపీ కుంచె రాజా, కోర్పు సాయి తేజ, పరిమి బాబు, తదితరులతో పాటు అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్ పై అవగాహన




**– అమలాపురం కమిషనర్ నిర్మల్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమములో భాగంగా అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని వడ్డిగూడెంలో ఉన్న శ్రీ వాగ్దేవి ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు "జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్" ( చెత్త రహిత సంస్థలు )అనే ఇతివృత్తంతో విద్యార్థులకు , పట్టణ ప్రజలకు స్వచ్ఛత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలు, హాస్పిటల్స్ ,ఇతర సంస్థలు అన్ని వ్యర్థాల నిర్వహణను సక్రమంగా నిర్వహించి, వ్యర్థ రహిత సంస్థలుగా మార్పు చెందాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు నిషేధించాలని సూచించారు. శ్రీవాగ్దేవి విద్యార్థులు ప్రదర్శించిన వేస్ట్ టూ ఆర్ట్ స్టాల్స్ ను కమిషనర్ పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు ,ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. తర్వాత అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ ను చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కె.వి.వి.సత్యనారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి రోహిత్ విద్యానంద్, శ్రీ వాగ్దేవి స్కూల్ డైరెక్టర్ పరసా రామ మూర్తి, ప్రిన్సిపాల్ సిస్టీ శ్రీరామ చంద్ర మూర్తి, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డ్ ల కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .

## ర్యాలిలో తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా






**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ ఆటో సెంటర్‌లో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తెలుగుదేశం స్తూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ స్థాపకుడు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.గ్రామ అధ్యక్షుడు పెండెం వెంకన్న జెండా ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అయిన ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సమర్థంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తూ, సంక్షేమ పథకాల అమలులోనూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దూరి సుబ్బారావు, మెర్ల నాగేశ్వరరావు, గూడెల్ల నాగేంద్రగౌడ, షేక్ గౌస్, పాలింగి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండరాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

**✸ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)**



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 29:** శ్రీ కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)అన్నారు. కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సీతాకోదండ రామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సప్త సప్తాహ మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, జనసేన పార్టీ నాయకులు దాడి చిన్నబుజ్జి, రామాలయ కమిటీ ప్రెసిడెంట్ బొడ్డేటి సత్తిబాబు,ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నాయకులు, జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) తోపాటు జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని కోదండరాముని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సప్త సప్తాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని భజన బృందాలు ఆలపిస్తున్న భక్తి గీతాలను వినసంపుగా ఆలకించారు. ఈ సందర్భంగా తుమ్మల బాబు మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఉద్దేశంతో సుమారు 49 రోజులపాటు సప్తహ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డా. నాగ మానస ను సత్కరించిన జనసేన నాయకులు



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా అమలాపురం నియోజకవర్గం ఈదరపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు డాశ్రీశ్రీ కొప్పుల నాగమానస నియమితులయిన సందర్భంగా వారి స్వగృహం నందు అభినందనలు తెలిపి సత్కరించారు. జనసేనపార్టీ సీనియర్ నాయకులు మైపాల తాతాజీ, మేడిది శ్రీను, నందెపు శ్రీను, కామిశెట్టి పండు, రాజు నాయుడు తదితరులు ఉన్నారు.

## ర్యాలిలో జగన్మోహిని కేశవ స్వామి కళ్యాణోత్సవాలు భక్తిరసపూర్ణం





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 29:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి దేవస్థానంలో వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తిరసపూర్ణ వాతావరణంలో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ఆదివారం స్వామివారికి అభిషేకం, తులసి పూజలు నిర్వహించగా, అమ్మవారికి కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి. నిత్య ఉపాసన, బలిహరణ, నీరాజన, మంత్రపుష్పం, వేదపారాయణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆనందోబ్రహ్మ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సభ్యులు, పేరిచర్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కార్యక్రమాల నిర్వహణలో ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి తదితరులు పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.

## అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి బదిలీ..

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గా పదోన్నతి



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ గా విశిష్ట సేవలు అందించిన టి నిషాంతి జిల్లా కలెక్టర్ గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఆమెను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె బదిలీ కావడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా జేసీ బాధ్యతలను కూడా ప్రస్తుత జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎప్పుడు తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఆమె వస్త్రధారణ, నడవడిక ఉండేది. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆమె ప్రజలకు చేరువుగా ఉండి ఉత్తమమైన సేవలు అందించారు. ఆమె సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ గా నియమించింది.

# శ్రీ సీతా కోదండరామస్వామి ఆలయంలో ఘనంగా ముగిసిన సప్తసప్తాహ మహోత్సవం.





- ఆలయవద్ద స్వామి వారి కళ్యాణం -శాంతి హోమం.
- ముగింపు ఉత్సవాలు, నవమి వేడుకలను పురస్కరించుకుని భారీ అన్నదానం.

**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 29**:కిర్లంపూడి మండలం జగపతినగరం సోమరాజుపేటలో వేంచేసియున్న శ్రీ సీతా కోదండరామస్వామి ఆలయంలో లోక కళ్యాణార్థం గత 49 రోజులగా నిర్వహిస్తున్న 3 వ సప్త సప్తాహ మహోత్సవ ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వామివారి కళ్యాణం, శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప ఆధ్యాత్మికపరుడు, శ్రీమంతుడు,
సంపర సుధాకర శ్రీ వినాయకవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపర సుధాకర శ్రీవినాయకవర్మ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం 49 రోజులు పాటు సప్తసప్తాహ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం పట్ల రామాలయ కమిటీ ప్రెసిడెంట్ బొడ్డేటి సత్తిబాబు,ఆలయ కమిటీ సభ్యులను ఈ సందర్భంగాఅభినందించారు.ఈ కార్యక్రమానికి సంపర సుధాకర శ్రీవినాయక వర్మతోపాటు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ కుమారుడు, తోట వరుణ్,జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, కిర్లంపూడి సొసైటీ ప్రెసిడెంట్ కుర్ల చిన్నబాబు, టిడిపి నాయకులు తూము కుమార్,చదరం చంటిబాబు కాళ్ళ వెంకటేష్, గుడాల రాంబాబు, దాడి రాజగోపాల్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆలయ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కిర్లంపూడి, చిల్లంగి,జగపతినగరం, గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదములు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 49 రోజులపాటు నిర్వహించిన సప్త సప్తాహ మహోత్సవ కార్యక్రమానికి, అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేకాడుతున్న ముగ్గురు వ్యక్తుల అరెస్టు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 29:** జగ్గంపేట శివారున రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు కి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6150 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

## పేదలకు కూడు,గూడు,బట్ట కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్ టి ఆర్ కే దక్కుతుంది.

-మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు.



**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 29**:పేదలకు తినడానికి కూడు,ఉండడానికి గూడు,కట్టుకోవడానికి బట్ట కల్పించిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు అన్నారు. కిర్లంపూడిలో టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా టిడిపినాయకుడు తూము కుమార్,కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు ఆద్వర్యంలో టిడిపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాట్లు చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిడిపి మండల అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు విచేసి టిడిపి జెండా ఆవిస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు భూపాలపట్నం ప్రసాద్, జిల్లా టిడిపి కార్యదర్శి చదరం చంటిబాబు సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, గొడే దొరబాబు,గంధం ఈశ్వరరావు, జ్యోతుల రాంబాబు,మంచిగంటి శ్రీను జంపన రవివర్మ,కాళ్ళ వెంకటేష్,పాటంశెటి మురళీకృష్ణ, పట్టు చంటిబాబు,బొజ్జ పు శ్రీను ఎంపీటీసీ గరగ గోవిందు, ఆళ్ల బాబులు, అనుకుల శ్రీకాంత్, గొడే బాల, సూతి శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌత్ చిన్న, గండే చల్లారావు,కాకిలేటి బుజ్జి, టిడిపి నాయకులు, కార్యకర్తలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ సి ఎం చర్చ్ ఫాదర్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 29:** స్థానిక ఆర్.సి.ఎం. చర్చ్ ఫాదర్ క్రైస్తవుల శ్రమ కాలంలో నిర్వహించే మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మ్రానికొమ్మల ఆదివారం- క్రీస్తు శ్రమల ఆదివారం అని పిలవబడే ఈ రోజు న యేసు ప్రభువు యేరుసలేము దేవాలయం లోకి గాడిద పిల్ల పై ప్రవేశించిన సంఘటన స్మరిస్తూ క్రైస్తవులు పాటలు పాడుకుంటూ, హోసన్న గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా దేవాలయం లోనికి ప్రవేశం చేశారు. కొందరు తమ వస్త్రాలను మరి కొందరు భక్తులు పువ్వులను జల్లుతూ యేసు క్రీస్తు ను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.ఆర్ సి ఎం చర్చి ఫాదర్ రాయప్ప ఆధ్వర్యంలో క్రైస్తవులందరూ ప్రభు ఎడల భక్తి పారవశ్యంతో భక్తి గీతాలు ఆలపిస్తూ మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు.

## ఏపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షునిగా మట్టపర్తి శ్రీనివాస్





**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**అమలాపురం కిమ్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యూజెఎఫ్)
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఎన్నికలలో జిల్లా అధ్యక్షునిగా మట్టపర్తి శ్రీనివాస్ (అంబాజీపేట సాక్షి విలేఖరి), ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పేపకాయల రాజు (అంబాజీపేట కోస్తావాణి ప్రతినిధి) లు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. వీరిని జర్నలిస్టు లు, అంబాజీపేట తాజా సభ్యులు అభినందనలు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఏలేశ్వరం లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన టిడిపి శ్రేణులు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 29:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక టిడిపి శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి 44 సంవత్సరాలు ఆయన సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు వైభోగుల సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సెంటర్ వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ శ్రేణులు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వైభోగుల సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సామాన్య ప్రజల కోసం ఆవిర్భవించిందని, స్వర్గీయ ఎన్టీ రామారావు ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చిత్త సుద్దితో అమలు చేసిన ఘనుడు అన్నారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహా నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో బూడి జగదీష్, గొర్రెల శివ, జ్యోతుల సత్తిబాబు, కనకరాజు, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక టిడిపి కార్యాలయం వద్ద పట్టణ టిడిపి నాయకులు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు, జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసారు. 44సంవత్సరాల కేకు కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. అన్యాయానికి ఎదురు నిలిచి అభివృద్ధి సంక్షేమ పాలనకు స్వర్గీయ నందమూరి తారక రామారావు అహర్నిశలు శ్రమించారని అన్నారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు అడుగుజాడల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నడుస్తున్నారని రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, రాయుడు చిన్న, సామంతులగోపి,ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను, మామిడి లలిత, నీలి త్రిమూర్తులు, భుగతా శ్రీను, కోరాడ కృష్ణ, పతివాడ అఖిలేష్, సిడగం బాలు, కిలారి రామచంద్ర రావు, కరోతి గాంధీ, శాంకని బాబ్జి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. రు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- రాజకీయ పెను సంచలనం
- ఎన్టీఆర్ ప్రస్తానం
- పేద ప్రజల ఆశా కిరణం
- ఎమ్మెల్యే వేగుళ్ళ

**మండపేట. పెన్ పవర్.మార్చ్ 29:** దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఘనత కేవలం ఎన్టీఆర్ కు మాత్రమే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో తొలుత టీడీపీ పార్టీ జెండాను ఎగురవేసి, పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా మండపేట కరాచీ సెంటర్ కు చేరుకొని అక్కడ ఎన్టీఆర్ విగ్రహంకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండపేట రథం సెంటర్ లోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని నినదించి పేదవారికి కూడు,గూడు, గుడ్డ సమకూర్చాలన్న మహోన్నతమైన ఆశయ సాధన కోసం, తెలుగువారి ఆత్మగౌరవ పరిరక్షణ కోసం వెండి తెర ఇలవేలుపు, తెలుగింటి ఆత్మీయ అన్నగారు నందమూరి తారకరాముని మానస పుత్రికగా పుట్టింది తెలుగుదేశం పార్టీ అన్నారు. 44 ఏళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు దివంగత మాజీ ముఖ్య మంత్రి, తెలుగు వారి గుండె చప్పుడు దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశంపార్టీని స్థాపించారని చెప్పారు. ఆనాడు రాజకీయలు అంటే కేవలం పెద్దవారికి మాత్రమే తెలుసన్నారు. అలాంటి సమయాల్లో సాధారణ పేద ప్రజలు టీడీపీని అక్కున చేర్చుకొని ఎన్టీఆర్ కు బ్రహ్మరథం పట్టారన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పేదల పక్షాన నిలిచి టీడీపీ పోరాటం చేస్తుందన్నారు. ఆనాడు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో 289 స్థానాలకు 201 సీట్లు టీడీపీ గెలుచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భవించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన పార్టీగా తెలుగుదేశం చరిత్ర సృష్టించిందన్నారు. దేశంలో మొదటిసారిగా తండ్రి ఆస్తిలో స్త్రీలకు సమాన హక్కు కల్పిస్తూ చట్టం తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్ దన్నారు. దేశంలోనే మొదటిసారిగా వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.30 ఫించన్ అందించారన్నారు. ఈ దేశంలో సంక్షేమ రాజ్యానికి తెర తీసింది ఎన్టీఆర్ మాత్రమే అన్నారు. ఆయన బాటలో ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు, నారా లోకేష్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నారని కొనియాడారు. మండపేట నియోజక వర్గంలో తనను టీడీపీ అభ్యర్థిగా నాలుగు సార్లు ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. మండపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు. అనంతరం టీడీపీ 44వ ఆవిర్భావం దినోత్సవం వేడుకలు సందర్భంగా పార్టీ ఆరంభం నుండి పార్టీలో ఉన్న సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా పార్టీలో వివిధ కార్యక్రమాలలో చురుగ్గా ఉండే వార్ని ఎమ్మెల్యే దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, కపిలేశ్వరపురం మండల టీడీపీ అధ్యక్షుడు బలవరెడ్డి సత్యనారాయణ, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, రాయవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, పట్టణ అధ్యక్షుడు మత్సా నాగబాబు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, ఎంపీపీ ఉండమట్ల వాసు, వాదా ప్రసాదరావు, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మండపేటలోౌా+=ూ కార్యక్రమంలో మార్చి 30 వ తేదీన ప్రజల నుంచి అర్జీల స్వీకరించనున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి.




**మండపేట.పెన్ పవర్.మార్చి 29 :** ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్నీ మార్చి 30 వ తేదీ మండపేట నియోజకవర్గం పరిధిలోని మండపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ౌా+=ూ (ౌబఎశ్రీఱష +తీఱవఋఱఎవ =వతీవంయిశ్రీ ూఎర్‌వఎ) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలు తమ సమస్యలను నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 టోల్ ఫ్రీ నంబర్ సేవను కూడా వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ సేవ ద్వారా ఎప్పుడైనా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని, వాటిపై సంబంధిత శాఖలు చర్యలు తీసుకుంటాయని తెలిపారు.

అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ౌా+=ూ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కావున మండపేట పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను తెలియజేయవలసిందిగా కోరుతున్నారు.

మండపేట నియోజక వర్గం పరిధిలో జరిగే టిడ్కో గృహ ప్రవేశాలు కార్యక్రమం లో స్థానిక శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వర రావు గారితో కలిసి పాల్గొనడం జరుగుతుంది అని తెలియ చేశారు

## ఈనాడుపై వైసీపీ నాయకుల ఫిర్యాదు



**మండపేట. పెన్ పవర్. మార్చి 29 :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అవమానించే విధంగా కార్టూన్ ప్రచురించారని ఆరోపిస్తూ ఈనాడు యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని మండపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు మందపల్లి రవికుమార్, మాజీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు జొన్నపల్లి సత్తిబాబు, టౌన్ వైసీపీ కార్యదర్శి పొలమాల సత్తిబాబు, గెల్ల బేబి కేదారనాథ్ తదితరులు కలిసి పోలీసులకు అందజేశారు. జగన్ మోహన్ రెడ్డి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే ఉద్దేశ్యంతోనే ఈ కార్టూన్ చిత్రీకరించబడిందని వారు ఆరోపించారు. కార్టూన్ గీసిన వ్యక్తి మాకిరెడ్డి, ఈనాడు ఎడిటర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఏడిద లూథరన్ చర్చిలో ఘనంగా పామ్ సండే వేడుకలు



**మండపేట.పెన్ పవర్.మార్చి 29 :** మండపేట: మండలంలోని ఏడిద లూథరన్ చర్చిలో పామ్ సండే (మట్టల ఆదివారం) వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవ. ఆర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పామ్ సండేను పురస్కరించుకుని చిన్నపిల్లలు, మహిళలు, సంఘ సభ్యులు ఖర్జూరపు మట్టలతో ఊరేగింపుగా చర్చికి చేరుకుని యేసుక్రీస్తు యెరూషలేములో ప్రవేశించిన ఘట్టాన్ని స్మరించుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, సందేశం, కీర్తనలు నిర్వహించారు. విజయ్‌కుమార్ తన సందేశంలో ప్రేమ, శాంతి, సేవామార్గం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో టీడీపి ఆవిర్భావ దినోత్సవం

- చినశంకర్లపూడి,ములగపూడి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే
- నియోజకవర్గ వ్యాప్తంగా రెపరెపలాడిన టీడీపీ జెండా





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 29:** తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పుట్టిందని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు. యుగపురుషుడు అన్న నందమూరి తారకరామారావు పార్టీ స్థాపించి 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలో చిన శంకర్లపూడి,ములగపూడి గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం అన్న ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి,ఆయన తెలుగువారికి ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలను స్మరించుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావు పేదవానికి అన్నం, గూడు,వస్త్రం అందాలనే నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందని రైతన్నకి అండగా నాగలి పేదవారికి పక్కాగా ఇల్లుని,శుభాలకి ప్రతీకగా పసుపు రంగుని వీటన్నిటిని మిలితం చేసి తెలుగు దేశం పార్టీ జెండాని రూపొందించడం జరిగిందని,పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి దేశంలోనే చరిత్ర సృష్టించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. 44 వ సంవత్సరాలుగా పార్టీకి వెన్నుదన్నుగా ఉంటున్న చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రి ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా జెండా వదలకుండా పోరాటాలు చేసిన కార్యకర్తలకు 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని,అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యకర్తలకు నాయకులకు అక్క చెల్లెమ్మలకు ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాళ్ల జగదీష్,అమరాది వెంకటరావు,మిరియాల శ్రీను,అడ్డాల త్రిమూర్తులు, యర్రాబత్తుల గోవిందు నాయుడు,జువ్విన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

- ఈత మట్టలతో క్రైస్తవుల ర్యాలీలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు





**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 29 :** పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు యేరుషలేము పుర ప్రవేశం చేసిన ఘట్టాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు ఈ వేడుకను ఒక పండుగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి, దైవ సందేశాలు వినిపించారు. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఈత మట్టలను పూలతో సుందరంగా అలంకరించి వాటిని చేత పట్టుకుని ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. పెద్దాపురం – జగ్గంపేట రహదారిలో గల తండ్రి కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ లో పాస్టర్ పరంజ్యోతి మట్టల ఆదివారం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దైవ సందేశం అందించారు. ప్రజలంతా ప్రేమ, సహనం, శాంతిని అలవరచుకుని క్రీస్తు మార్గంలో పయనించాలని అన్నారు. క్రీస్తు చూపిన ప్రేమ, సహనం, త్యాగనిరతి నేటి సమాజానికి ఎంతో అవసరమని, ప్రతీ ఒక్కరూ శాంతి మార్గంలో పయనిస్తూ తోటివారికి సహాయపడాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో మానవులకు అత్యంత అవసరమైనవి ప్రేమ, సహనం, త్యాగమని, లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఎరుషలేము పుర ప్రవేశం కేవలం ఒక ఊరేగింపు కాదని, అది వినయానికి మరియు శాంతికి నిదర్శనమన్నారు. అహంకారాన్ని వీడి, దీనత్వాన్ని ధరించడమే నిజమైన క్రైస్తవ లక్షణమని, క్రీస్తు చూపిన మార్గం సమస్త మానవాళికి శాంతి సందేశమని తెలిపారు. ద్వేషం ఉన్న చోట ప్రేమను, కల్లోలం ఉన్న చోట శాంతిని నెలకొల్పడమే భక్తులు దేవునికి ఇచ్చే నిజమైన కానుకని, ప్రతీ ఒక్కరూ స్వార్థాన్ని విడనాడి, పరోపకార చింతనతో మెలుగుతూ, క్రీస్తు చూపిన క్షమాగుణాన్ని అలవరచుకోవాలని, అప్పుడే సమాజంలో శాంతి వర్ధిల్లుతుందన్నారు. మానవత్వమే పరమార్థంగా జీవించాలని, ఈ పర్వదినం మన హృదయాలలో నూతన ఆధ్యాత్మిక వెలుగులను నింపాలని అని ఆమె ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫౌండర్ రౌతు సూరిబాబు, పాస్టర్ డానియల్ వరప్రసాద్, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా మట్టల ఆదివారం

అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్న క్రైస్తవులు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 29;**మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. ప్రభువైన క్రీస్తుకు శిలువ వేసే ముందు ఆదివారాన్ని మట్టల ఆదివారం పర్వదినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మానవజాతికి మోక్షాన్ని ప్రసాదించి జయ ప్రవేశం కల్పించే దినంగా మట్టల ఆదివారం విశిష్టత కలిగి ఉంది. దేవుని పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉంచి క్రీస్తు బోధనలను ఆచరిస్తూ దైవ ప్రార్థనలో క్రైస్తవులు తరించారు. అందులో భాగంగా క్రైస్తవులు ఈతమట్టలు చేతబూని గ్రామ, పుర వీధుల్లో బారీ ర్యాలీలు నిర్వహించారు. దావీదు కుమారునికి జయం హల్లెలూయా హోసన్నా అంటూ నినాదాలు చేశారు. ప్రభువైన క్రీస్తు బోధనలను ఆచరించవలసిన ఆవశ్యకతను మానవాళికి వివరించారు.

## యధావిధిగా 'మీకోసం' రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు

- 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీలు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 29:**రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను మార్చి 30న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలలో కూడా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంపచోడవరం పీఓ ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు ఆర్డీవోలు, తహశీల్దార్లు మరియు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు.

ప్రజలు తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని, అలాగే 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీలు సమర్పించడంతో పాటు వాటి స్థితి గురించి తెలుసుకోవచ్చని తెలిపారు.'పీపుల్స్ ఫస్ట్' ధోరణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ చెప్పారు. అదనంగా, పౌర సేవలను మరింత సులభతరం చేయడానికి 95523 00009 వాట్సాప్ నెంబర్ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ

కట్టమూరులో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 29 :** తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతే ధ్యేయంగా 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అన్న నినాదంతో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పలువురు నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని కట్టమూరు, తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టమూరు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక పార్టీ వేడుక కాదని, అది ప్రతీ తెలుగువాడి ఇంటి పండుగ అని పార్టీ శ్రేణులు అభివర్ణించాయి. ఎన్టీఆర్ స్థాపించిన ఈ పార్టీ తరతరాల తెలుగు వారి ఆకాంక్షలకు ప్రతిరూపమని, పేదవారికి 'కూడు, గూడు, గుడ్డ' అందించడమే తమ సిద్ధాంతమని అన్నారు. క్రమశిక్షణ కలిగిన లక్షలాది మంది కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, వారందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ అని, ఎన్టీఆర్ స్ఫూర్తితో అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు లభించిందన్నారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన ఘనత టీడీపీదే అని, ప్రపంచస్థాయిలో తెలుగువారిని నెంబర్ వన్ గా నిలపడమే లక్ష్యమని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, రాజకీయాలంటే వ్యాపారం కాదని నిరూపిస్తూ, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎన్టీఆర్ కఠిన నిబంధనలు అమలు చేశారన్నారు. దేశంలోనే తొలిసారిగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత టీడీపీదే అని, విద్య, ఉద్యోగాల్లో 30% రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల్లోనూ ప్రాతినిధ్యం కల్పించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని మలుపు తిప్పేలా టీడీపీ అనేక సంస్థలను నెలకొల్పిందని, మహిళా విద్య కోసం ప్రత్యేకంగా తిరుపతిలో పద్మావతి విశ్వవిద్యాలయం ఏర్పాటు, అలాగే దేశంలోనే మొదటిసారిగా వైద్య విద్య కోసం ప్రత్యేక వర్సిటీ, ఉన్నత విద్యను అందరికీ చేరువ చేసేలా సార్వత్రిక వర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేదల ఆకలి తీర్చడానికి రెండు రూపాయలకే కిలో బియ్యం, తలదాచుకోవడానికి పక్కా ఇళ్లు, ఒంటికి జనతా వస్త్రాలు వంటి పథకాలతో సంక్షేమ రాజ్యాన్ని నిర్మించిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని నేతలు కొనియాడారు. ఎన్టీఆర్ వేసిన పునాదులపైనే నవ్యాంధ్ర నిర్మాణానికి తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడిది శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుత్తుల సూర్యావతి, గుత్తుల శ్రీనివాస్, నీటి సంఘం ఉపాధ్యక్షుడు చేవ సీతారామరాజు, దిబ్బిడి రాజబాబు, భువనాశి గంగాధర్, రాసంశెట్టి నాగబాబు, మార్ని మోహనరావు, చుండ్రు సత్యనారాయణ, మార్ని బుచ్చిరాజు, దొడ్డి అప్పారావు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలవరం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్ దినేష్ కుమార్





**గంగవరం/ ఎటపాక, పెన్ పవర్ ,మార్చి 29:** పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఎటపాక మండలం పిచ్చుకలపాడు గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆర్ & ఆర్ ప్యాకేజీని అర్హులైన వారికి వచ్చే ఏడాదిలోగా అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో త్రాగునీటి సరఫరా కోసం జల జీవన్ మిషన్ కింద రూ.37 లక్షలు మంజూరై, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆరోగ్య సేవలు మెరుగుపరచడం, చెరువుల మరమ్మత్తులు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, గృహాలు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తూతిగచెరువు పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం చింతూరు మండలం ఏజీకోడేరు గ్రామంలో ముంపు బాధితులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ల్యాండ్ టు ల్యాండ్ పునరావాసం, పింఛన్లు, రేషన్ కార్డులపై గ్రామస్తుల అభ్యర్థనలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సహా వివిధ శాఖల అధికారులు ఏపీ ఓ జనరల్ రామ తులసి, తాసిల్దార్లు శ్రీనివాసరావు, హుస్సేన్, ఎంపీడీవోలు ఎస్. శ్రీనివాసరావు,విజయ దత్తు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, సిడిపిఓ అరుణ, డాక్టర్ శ్రీదేవి, ఎంఈఓ, లక్ష్మీనారాయణ, సర్పంచ్ రాంబాబు,ఎంపీటీసీ జె. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ స్థాపనతో సంస్కరణలకు ఆద్యుడు ఎన్టీఆర్



- రిక్షా తొక్కి, రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ
- తెలుగుదేశం 44వ ఆవిర్భావ వేడుకలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:**స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారని పార్టీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు, విద్యావంతులకు పెద్ద పీట వేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. పార్టీ 44వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల రిక్షా తొక్కుతూ స్థానిక కోటిపల్లి బస్టాండ్ లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గరకు చేరుకొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఆనాడు ఎన్టీఆర్ వేసిన పునాది కారణమన్నారు. పద్మావతి మహిళా విశ్వవి ద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయం స్థాపన, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ కే చెల్లిందన్నారు. పేదలకు కిలో రెండు రూపాయల బియ్యం, పేదలకు పక్కా గృహాలు, జనతా వస్త్రాలు అందించారని ఎమ్మెల్యే గోరంట్ల గుర్తుచేసారు. తెలుగు భాషను , తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. ఎన్టీఆర్ పంథాను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తూ, ఎన్నో ప్రజా సంక్షేమలను అమలు చేస్తున్నారని, ఆర్థికంగా ప్రగతిపథంలో చంద్రబాబు నడిపిస్తురన్నారు. యువనేత లోకేష్ రాష్ట అభివృద్ధి కి శ్రమిస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న 20 మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలను సత్కరించారు. రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, వెలుగుబంటి రఘురాం, మార్గాన్ని సత్యనారాయణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, నిమ్మలపూడి గోవింద్, నున్న కృష్ణ, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, , , గంగిన నాని, దండమూడి ప్రమీల, మద్దా మణి, పిల్ల తనూజ, గంగిన జాహ్నవి, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోనీ, బూర దుర్గారావు, నిచ్చెన కోళ్ళ సత్తిబాబు, ఉండవల్లి బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.